క్లుప్తంగా

రహదారిపై పోలీసుల తనిఖీలు

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లోని జాతీయ రహదారిపై పోలీసులు శనివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్‌ఐలు మాధవరెడ్డి, శ్రీనివాసులు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ప్రధానంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

ఓటుహక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి



అడ్డాకుల: మండలంలోని రాచాల, పొన్నకల్, కందూర్ గ్రామాల్లో శనివారం సాయంత్రం కేంద్ర బలగాలతో జిల్లా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్‌ఐ కృష్ణయ్య, అడ్డాకుల, మూసాపేట ఎస్‌ఐలు మాధవరెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలోని ప్రైవేటు కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీయూ జేఏసీ నాయకులు వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కొన్ని కళాశాలల్లో డెవలప్‌మెంట్ ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు పేర్కొన్నారు. అన్ని ఫీజులు వసూలు చేస్తున్నా సరైన ఫ్యాకల్టీ లేకుండా నిర్వహిస్తున్నారని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాము, రవి, శివ పాల్గొన్నారు.

30న మందకృష్ణ రాక

మహబూబ్‌నగర్ రూరల్: మాదిగల విశ్వరూప మహా రథయాత్రలో భాగంగా ఈనెల 30న పాతపాలమూరుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ విచ్చేస్తున్నారని నాయకులు పోలే బాలయ్య, వెంకటస్వామి, కంతి ఖాదరయ్యలు తెలిపారు. శనివారం గ్రామాల్లో రథయాత్ర కరపత్రాలను పంపిణీ చేశారు. మాలరాజు, శ్రీరాములు, కేశవులు, రాజారాం, రామన్న తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో చేరికలు

నవాబుపేట: మండల పరిధిలోని యన్మన్‌గండ్లలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు శనివారం బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ సమక్షంలో పార్టీలో చేరారు. నాయకులు గిరి, గొరెంక, మధు పాల్గొన్నారు.

బస్సుయాత్రకు తరలిన నాయకులు

గండేడ్/మహమ్మదాబాద్: పరిగిలో శనివారం నిర్వహించిన విజయభేరి బస్సుయాత్రకు గండేడ్, మహమ్మదాబాద్ మండలాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.కాంగ్రెస్ అధ్యక్షులు జితేందర్‌రెడ్డి, కేఎం నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్లు రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉమ్మడి మండలం లీగల్ సెల్ అడ్వైజర్ పుల్లారెడ్డి, ఎంపీటీసీ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఖరారుతో సంబురాలు

బాలానగర్: నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి టికెట్ ఖరారు కావడంతో మండల కేంద్రంలో శనివారం నాయకులు సంబురాలు చేసుకున్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ అధ్యక్షుడు ఆదిరమణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మకు మొక్కు చెల్లింపు

నవాబుపేట: పర్వతాపూర్ మైసమ్మకు అనిరుధ్ రెడ్డి యువసేన నాయకులు 101 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. మండలానికి చెందిన యువసేన నాయకులు సురేష్, నర్సింహ, వెంకట్‌రెడ్డి, రాజు , కుమార్, ఆంజనేయులు, వెంకటయ్య తదితరులు శనివారం కార్యక్రమం నిర్వహించారు. టికెట్ రావడంతో మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు.

కోయిల్‌కొండ: కాంగ్రెస్ గెలుపుఖాయమని పలువురు నాయకులు అన్నారు. మండల నాయకులు జి.రవీందర్, విద్యాసాగర్ శనివారం మాట్లాడారు. పర్నికారెడ్డికి టికెట్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

నిరుద్యోగ శాతం పెరిగింది

స్టేషన్ మహబూబ్‌నగర్: బీఆర్‌ఎస్ హయాంలోని తొమ్మిదన్నరేళ్లలో నిరుద్యోగిత 15.5శాతానికి పెరిగిందని టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇంటికో ఉద్యోగం అంటూ కేసీఆర్ యువతను మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణ వచ్చాక ఒకే ఒక్క డీఎస్సీ నిర్వహించిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఎన్నికల్లో యువత కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచి గెలిపించాలని కోరారు. అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసి, ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు.

ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి



అడ్డాకులలో వాల్మీకి జయంతి

సాక్షినెట్‌వర్క్: జిల్లాలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో శనివారం వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు.

పీయూలో వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహించారు. వీసీ ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు.

అదేవిధంగా జిల్లా కేంద్రంలోని వివిధ కళాశాలల్లో వేడుకలు నిర్వహించారు.

చౌదర్‌పల్లిలో పీబీ కుర్మయ్య, దొబ్బలి చెన్నకేశవులు, గుజుల కొండయ్య పాల్గొన్నారు.

అడ్డాకుల, మూసాపేట మండలాల్లో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, సర్పంచులు శ్రీకాంత్, కల్పన, రైతు బంధు అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నకల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

జడ్చర్ల మండలంలోని కుర్వపల్లిలో ఆయన విగ్రహం వద్ద పూజలు చేశారు. ఆయన ఫొటోలను పంపిణీ చేశారు. సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ పాండునాయక్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలో మోటర్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. నాగసాల ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు చేపట్టారు. సరస్వతి శిశుమందిరంలోనూ వేడుకలు నిర్వహించారు.

దేవరకద్రలో ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎమ్మెల్యే సతీమణి ఆల మంజుల పూలమాల వేశారు. ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

భూత్పూర్ మండలంలోని కర్వెనలో వాల్మీకి సంఘం మండల అధ్యక్షుడు బి. మల్లేష్, తిమ్మయ్య, వీరయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

చిన్నచింతకుంటలో గ్రామ వాల్మీకి సంఘం నాయకులు జూరాల ప్రాజెక్ట్ నుంచి కృష్ణజలాలను తీసుకవచ్చారు. ఆలయంలో వాల్మీకి విగ్రహానికి జలాభిషేకం చేశారు.



మూసాపేటలో..



దేవరకద్రలో..



జడ్చర్లలో బైక్‌ర్యాలీ



చిన్నచింతకుంటలో..



కర్వెనలో..



చౌదర్‌పల్లిలో..

ముగిసిన ఎన్నికల శిక్షణ

జడ్చర్ల టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలోని పీఓలు, ఏపీఓల శిక్షణ శనివారం ముగిసింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాలుగు గ్రూపులుగా విభజించి శిక్షణ ఇచ్చారు. మొత్తం 700మంది పీఓలు, ఏపీఓలకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. రెండోరోజు శనివారం ఉదయం 175మంది, మధ్యాహ్నం 165మంది శిక్షణకు హాజరయ్యారు. హాజరుకాని వారికి ఆదివారం ఉదయం మహబూబ్‌నగర్ ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఉంటుందని నోడల్ అధికారి మంజులాదేవి వివరించారు.

దర్గా వద్ద ప్రత్యేక పార్థనలు

భూత్పూర్: మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాలల్లో గ్యార్వీ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ముడా డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, టీపీసీసీ మైనార్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాదిక్, టీపీసీసీ సేవాదళ్ సెక్రటరీ సంజీవరెడ్డి దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం భోజనం చేశారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

చిన్నచింతకుంట: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ కాంతరావు అన్నారు. గూడూర్ నుంచి కురుమూర్తి స్వామి ఆలయం వరకు నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులను శనివారం పూర్తి చేసిన సందర్భంగా పరిశీలించి మాట్లాడారు. ఆలయ కమిటీ మెంబర్ నాగరాజు, కురుమూర్తి, చింతలముని తదితరులు పాల్గొన్నారు.

రవీందర్‌రెడ్డి సేవలు మరువలేం

కోయిల్‌కొండ: రెడ్డిగారి రవీందర్‌రెడ్డి సేవలు మరువలేనివని మండల కాంగ్రెస్ నాయకులు బండియాదవ్ కుమార్, యాదయ్య యాదవ్ అన్నారు. శనివారం గ్రంథాలయ మాజీ చైర్మన్ రెడ్డిగారి రవీందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రవీందర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట: కార్యకర్తలు బీఆర్‌ఎస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చిన్నచింతకుంటలో బీఆర్‌ఎస్ ముఖ్యనాయకుల సమావేశానికి హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పని చేసి పార్టీ గెలుపునకు కృషిచేయాలన్నారు. కార్యకర్తలు 30 రోజులు కష్టపడి పని చేసి గెలిపిస్తే 18 వందల రోజులు వారి కోసం పనిచేస్తామన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. వాటిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

మోసానికి..అభివృద్ధికి మధ్య యుద్ధం



రుద్రారంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవాబుపేట: మోసానికీ.. అభివృద్ధికి మధ్య జరుగుతున్న యుద్ధంలో ఎటు వైపు ఉండాలో నిర్ణయించుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రుద్రారం, కొండాపూర్, హాజిలాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే గతంలో మాదిరిగా మైసమ్మ ఆలయంలో పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నాయకులు పార్టీలో చేరారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మండల అధ్యక్షుడు నర్సింహులు, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

సాక్షినెట్‌వర్క్: జిల్లాలో బీఆర్‌ఎస్ ప్రచారం జోరుగా సాగుతోంది. ఆయా మండలాలు, గ్రామాల్లో నేతలు పథకాలపై ప్రజలకు వివరిస్తున్నారు. దేవరకద్రలోని పలు తండాల్లో శనివారం ఎమ్మెల్యే ఆల సతీమణి మంజుల గిరిజన మహిళలతో కలిసి ప్రచారం చేశారు. ఎంపీపీ రమాదేవి పాల్గొన్నారు.

అడ్డాకుల మండలంలోని కాటవరం తండాలో శనివారం రాత్రి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి ఆల మంజుల ఇంటింటి ప్రచారం చేపట్టారు.

భూత్పూర్ పట్టణంలోని 10వ వార్డులో శనివారం మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ముడా డైరెక్టర్ చంద్రశేఖర్ గౌడ్, అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

రాజాపూర్ మండలంలోని గ్రామాల్లో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పిరిబచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నాయకులు ప్రచారం నిర్వహించారు.

కోయిల్‌కొండలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు రాజ్‌కుమార్, శేఖర్, లక్ష్మీనారాయణ, కుమ్మరిరాజు తదితరులు ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌నాయకుల ప్రచారం జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రంలోని న్యూమోతీనగర్ 35వ వార్డులో శనివారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ప్రజలకు గ్యారంటీ పథకాల గురించి వివరించారు.

దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి జి.మధుసూదన్‌రెడ్డి దంపతులు శనివారం కురుమూర్తి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రచార వాహనాలకు పూజలు చేయించారు. శనివారం రాత్రి భూత్పూర్ పట్టణంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు పట్టాలు, పట్టణంలో 30 పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల తదితరాలపై హామీ ఇచ్చారు. అనంతరంలో రామలింగేశ్వర ఆలయంలో పూజలు చేశారు. రాజాపూర్‌లో మండల అధ్యక్షుడు కృష్ణయ్య, వెంకట్‌నాయక్, శంకర్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.

సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలం



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో సర్వేలన్నీ కాంగ్రెస్‌కే అనుకూలంగా ఉన్నాయని డీసీసీ అధ్యక్షుడు, మధుసూదన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సంక్షేమ పథకాల డబ్బులు నవంబర్ 2లోపు ఖాతాల్లో వేయాలని కోరితే దానిని బీఆర్‌ఎస్ వక్రీకరించిందన్నారు. నిపుణులతో చర్చించకుండా ప్రాజెక్టులు కట్టారని, మేడిగడ్డ పరిస్థితి ఏమైందో అందరికీ తెలిసిందన్నారు. రాజకీయాల్లో అలకలు సహజమని సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. అంతర్జాతీయస్థాయి ప్రాజెక్టు కట్టామని గొప్పలు చెప్పిన కేసీఆర్ మాడల్ అభివృద్ధి మేడిగడ్డ ఘటనతో తేలిపోయిందని మహబూబ్‌నగర్ అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇక్కడ చౌరస్తాలను మేకప్ చేసి ఏదో అభివృద్ధి చేసినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. జడ్చర్ల-మహబూబ్‌నగర్ హైవే 2012–14లో మంజూరైందని, భూత్పూర్ నుంచి వన్‌టౌన్ వరకు రోడ్డు అప్పుడే పూర్తయిందన్నారు. వినోద్‌కుమార్, నాగరాజుగౌడ్, సిరాజ్‌ఖాద్రీ, అన్వర్‌పాష, లక్ష్మణ్‌యాదవ్, అజ్మత్ అలీ, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల మూసివేత



జడ్చర్ల టౌన్: మండలంలోని పేరుగాంచిన గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయాన్ని శనివారం రాత్రి పాక్షిక చంద్రగ్రహణం ఉన్న కారణంగా మధ్యాహ్నం నుంచి మూసివేశారు. పూజల అనంతరం అర్చకులు గర్భగుడితోపాటు ప్రధాన ద్వారం సైతం మూసివేసి తాళాలు వేశారు. తిరిగి ఆదివారం ఉదయం భక్తులకు స్వామి దర్శనం కల్పిస్తామని వివరించారు.

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని శనివారం సాయంత్రం మూసి వేశారు. చంద్రగ్రహణం నేపథ్యంలో నిత్య విధి పూర్తిచేసి ఆలయాన్ని మూసివేశారు. తిరిగి ఆదివారం కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆలయ చైర్మన్ రమేష్‌గౌడ్, ఈఓ రాజేశ్వరశర్మ తెలిపారు.

కొనసాగుతున్న పనులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దకు గుట్టపై రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. రామస్వామి గుట్టపై పురాతన కాలంలో నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయానికి అయ్యప్ప దేవాలయం పక్కన ఉన్న గుట్ట నుంచి కొత్తగా మట్టి రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. గతంలో వేసిన రోడ్డు వర్షాలకు కోతకు గురవడంతో దానిపై వాహనాలు వెళ్లడానికి వీలు కావడం లేదు. దీంతో మట్టిని వేయించి చదును చేయిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణం కోసం కొత్తగా ఏర్పాటైన కమిటీ ద్వారా దాతల సాయంతో పనులు చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కార్యదర్శిగా సంజీవరెడ్డి

భూత్పూర్: మండలంలోని కొప్పెటకి చెందిన సంజీవరెడ్డిని టీపీసీసీ సేవాదళ్ కార్యదర్శిగా నియమించారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్‌జీ దేశాయి శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ట్రెజరర్ కె. జనార్దన్ రెడ్డి చేతులమీదుగా నియామక పత్రాన్ని ఆయన అందజేశారు.

బీజేపీకి మద్దతు ప్రకటించాలి



మిడ్జిల్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీలను ముఖ్యమంత్రి చేస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారని, అందువల్ల పార్టీకి బీసీ సంఘాలు మద్దతు ప్రకటించాలని జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు తిరుపతి, నరేందర్, పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: బీసీ సంఘాలన్ని బీజేపీకి మద్దతు ఇవ్వాలని జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు చంద్రన్న, హన్మంతు, శ్రీను, రవి, నాగరాజులతో పాటు పలువురు ఉన్నారు.

ఓటుతోనే బుద్ధి చెప్పాలి




హన్వాడ: మూడు గంటల కరెంటు చాలన్న కాంగ్రెస్‌కు అన్నదాతలు ఓటుతోనే బుద్ధి చెప్పాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం రామన్నపల్లి, వేపూర్, లింగన్నపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. 70 ఏళ్లుగా అన్నదాతలను పట్టించుకోని కాంగ్రెస్.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ అందిస్తుంటే ఓర్వలేక పోతోందన్నారు. మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల, నాయకులు నరేందర్, రమణారెడ్డి పాల్గొన్నారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రం మోతినగర్‌కు చెందిన పలువురితోపాటు ముదిరాజ్ సంఘం నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. శనివారం ఫాంహౌస్‌లో కండువా కప్పి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పార్టీలోకి ఆహ్వానించారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్థానిక మూడో వార్డు పరిధిలోని అప్పన్నపల్లి, శ్రీనగర్‌కాలనీ, శ్రీరామకాలనీ, బీసీకాలనీలలో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ వైస్ చైర్మన్ కె.వెంకటయ్య, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, 42వ వార్డు కౌన్సిలర్ రామలక్ష్మణ్, బీఆర్‌ఎస్ నాయకులు శాంతన్నయాదవ్, నాగేష్, నర్సింహులు పాల్గొన్నారు.

బీజేపీ గెలిస్తే ఎమ్మెల్యే ట్యాక్స్ ఉండదు



పాలమూరు: బీజేపీ అభ్యర్థి గెలుపొందిన మరుక్షణం నుంచి ఎమ్మెల్యే ట్యాక్స్ అనేది ఉండదని, పాలమూరులో రామరాజ్యం సాధన కోసం కృషి చేస్తానని అభ్యర్థి ఏపీ మిథున్‌కుమార్ రెడ్డి అన్నారు. పాలమూరులో ఎలాంటి వ్యాపారం చేయాలన్నా..దుకాణాలు పెట్టుకోవాలన్నా డబ్బులు దండుకుంటున్నారన్నారు. పద్మావతి కాలనీలో ఆయన నివాసం నుంచి పార్టీ కార్యాలయం వరకు శనివారం ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 9ఏళ్లుగా ఉద్యమ సెంటిమెంట్‌తో ప్రజలను మోసం చేసిందన్నారు. పాలమూరులో కేంద్రం నిధుల ద్వారానే అభివృద్ధి జరిగిందన్నారు. జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, నాగూరావు నామాజీ, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీలను అడ్డుకున్న మహిళా రైతులు



గోవింద్‌పల్లి వద్ద లారీలను కంచె వేసి అడ్డుకున్న మహిళా రైతులు

గండేడ్: మట్టి, కంకర తరలింపుతో పంటలు దెబ్బతింటున్నాయని లారీలను శనివారం మహిళా రైతులు అడ్డుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గోవింద్‌పల్లి శివారులో క్రషర్, డాంబర్‌ప్లాంట్లు ఉన్నాయి. వీటితో పాటు నేషనల్ హైవేకు మట్టిని తరలిస్తున్నారు. నిత్యం వందల వాహనాలు ఈ రోడ్డు గుండా తిరుగుతున్నాయి. దుమ్ము విపరీతంగా వస్తోంది. దీంతో కప్లాపూర్, గోవింద్‌పల్లి జానంపల్లి గ్రామాలకు చెందిన పలువురి పంటలు దెబ్బతింటున్నాయి. విషయంపై పలుమార్లు చెప్పినా ఎవరు పట్టించుకోవడం లేదని మహిళలు రోడ్డుపై ముళ్లకంచె, రాళ్లు వేసి లారీలు, ట్రాక్టర్లు వెళ్లకుండా అడ్డుకున్నారు. సాయంత్రం వరకు ఒక్క వాహనాన్ని వెళ్లనివ్వలేదు. పోలీసులకు సమాచారం ఇచ్చినా, వారు చెబితే కూడా మొదట్లో వినలేదు. తాము కొన్ని వాహనాలు వెళ్తాయంటే అంగీకరించామని, వందలాది వాహనాలు వెళ్తే.. ఎలా అని ప్రశ్నించారు. చివరకు గ్రామపెద్దలు క్రషర్ వారితో, రైతులతో మాట్లాడారు. తగిన పరిహారం ఇచ్చేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.